యాదమరి చిత్రకారునికి "రవీంద్ర రత్న పురస్కార్"

ప్రజాశక్తి-యాదమరి: యాదమరి చిత్రకారునికి వెయిల్ ఫౌండేషన్, బెంగుళూరు వారు రవీంద్ర రత్న పురస్కారంతో సత్కరించారు. వివిధ రంగాలలో నిష్ణాతులైన ప్రముఖులను రవీంద్ర రత్న పురస్కారంతో సత్కరించడం ఆనవాయితీ. ప్రముఖ చిత్రకారులు, యాదమరి జెడ్పీ ఉన్నత పాఠశాల, ఆర్ట్ మాస్టర్ కె.దామోదరాచారికి చిత్రకళా రంగంలో ప్రతిష్టాత్మకమైన "రవీంద్ర రత్న పురస్కార్" లభించింది. దామోదరచారి సాంప్రదాయ, జానపద, ఆధునిక, నైరూప్య శైలి చిత్రాలతో జాతీయ అంతర్జాతీయ చిత్రకళ పోటీలలో కొన్ని వందల బహుమతులను కైవసం చేసుకున్నారు. పురాణ ఇతిహాసాలతో పాటు సామాజిక స్పృహతో సమాజాన్ని పీడించే అనేక సమస్యలపై అద్భుతమైన చిత్రాలను రూపొందించి కీర్తి ప్రతిష్టలను పొంది ఉన్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం రాజారావు, ఉపాధ్యాయ బృందం ఆయనను అభినందించారు.

పూతలపట్టు ఆశావహుల్లో హీటు

- అభ్యర్థి ఎవరనేదానిపై సందిగ్ధత
- తెరమీదకు పలు ఆశావహుల పేర్లు
- ధీమాగా నియోజవర్గంలో ప్రచారం చేస్తున్న ప్రస్తుత ఇన్‌ఛార్జ్
- మలి దశ జాబితా కోసం అంతా ఎదురుచూపు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: పూతలపట్టు నియోజకవర్గ స్థానంలో గెలుపునకు అభ్యర్థి విషయంగా టీడీపీ అధిష్టానం ఆచీతూచీ వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గాల విభజన అనంతరం ఒక్కసారికూడా అక్కడ గెలవకపోవడంతో ఈ దఫా ఆ స్థానాన్ని ఎలాగైనా చేజిక్కించుకోవలనే వ్యూహాల్లో అధినేత చంద్రబాబు ఉన్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాగా ఆశావహుల పేర్లను పరిశీలన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే నియోజకవర్గంలో అభ్యర్థి ఎవరైతే విజయావకాశాలు ఉన్నాయనే సంపూర్ణ సర్వే రిపోర్ట్‌ను చంద్రబాబు తెప్పించుకొని పరిశీలిస్తున్నట్లు టీడీపీ నేతల్లో టాక్ నడుస్తోంది.

విభజనానంతరం వరుస పరాజయాలు..

నియోజకవర్గాల పునర్విభజనానంతరం 2009లో కాంగ్రెస్ పార్టీ, ఆ తరువాత 2014, 2019లో వైసీపీ అభ్యర్థులు పూతలపట్టులో విజయాలు సాధించారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటమిపాలైన టీడీపీ అభ్యర్థి లలితకుమారి ఎన్నికల అనంతరం ఆమె పార్టీకి రాజీనామా చేసి క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు.

ధీమాగా ప్రచారంలో ప్రస్తుత ఇన్‌ఛార్జ్..

ఇంటింటి ప్రచారంలో డాక్టర్ మురళిమోహన్

ఓ మీడియా సంస్థలో జర్నలిస్టుగా పనిచేస్తున్న డాక్టర్ కలికిరి మురళిమోహన్‌ను టీడీపీ పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా నియమించింది. కాగా పూతలపట్టులో జరిగిన ఓ సభలో చంద్రబాబు మురళిమోహన్‌ని ఆశీర్వదించాలని ప్రకటించినప్పటికీ తొలిజాబితాలో ఆయన పేరు రాలేదు. దీంతో ఆ స్థానంపై ఒకింత సందిగ్ధత నెలకొంది. కానీ తమకే సీటు కేటాయించారంటూ మురళీమోహన్ ధీమాగా నియోజకవర్గంలో పర్యటిస్తూ తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.

ఆశావహుల్లో టెన్షన్.. టెన్షన్..

ఎన్నికల నోటిఫికేషన్ సమయం సమీపిస్తున్న కొద్దీ ఆశావహుల్లో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఎట్టి పరిస్థితిల్లో తమ సీటు కేటాయిం చాలంటూ ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నట్లు సమా చారం. కాగా మాజీ మంత్రి గల్లా అరుణకుమారి శిష్యుడిగా పేరు ఉన్న యువ పారిశ్రామికవేత్త ముత్తు అలియాస్ పాకాల ముద్దుకృష్ణ, ప్రముఖ సినీనటుడు ఐరాల మండలం చెందిన సప్తగిరి ప్రసాద్, అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్నారు. అలాగే 2009లో కాంగ్రెస్ పార్టీ తరపున పూతలపట్టు నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలుపొందిన డాక్టర్ రవి ఈ దఫా టిడిపి అభ్యర్థిగా నియోజకవర్గంలో పోటీచేయాలని తన వంతు ప్రయత్నాలు సాగిస్తు న్నారని తెలుస్తోంది. ఇప్పటికే పలుమార్లు అధినేత చంద్రబాబు, నారా లోకేష్‌లను కలిసినట్లు సమాచారం.

మలిజాబితాపై ఎదురుచూపు..

ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించాయి. అందులో పూతలపట్టు నియోజకవర్గ అభ్యర్థి పేరు ప్రకటించలేదు. దీంతో ఆశావహుల్లో ఒకింత టెన్షన్ కనిపిస్తోంది. మలిజాబితాలోనైనా తమ పేరు వస్తుం దేమోనని ఎదురుచూస్తున్నారు. అయినా ఎవరి స్థాయిలో వారు ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నారు.

శివోహం..

- శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- శుక్రవారం రాత్రి జాగరణ



సోమలలో

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: శివనామస్మరణతో మొగిలీశ్వరాలయం మార్మోగింది. శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా మొగిలి స్వయంభుగా వెలసియుండు శ్రీ కామాక్షి సమేత మొగిలి స్వరాలయంలో ఉదయం నుండి శివ భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి మునిరాజులు పూజా కార్యక్రమాలు, భక్తులకు కావలసిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీఐ లక్ష్మయ్య, ఎస్ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో బందోస్తు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు శుక్రవారం ఉదయాన్నే స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అదేవిధంగా జీకేసీ కళ్యాణమండపం యాజమాన్యం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: శివరాత్రి సందర్భంగా మండలంలోని పలు శివాలయాలు శుక్రవారం భక్తులతో కిటకిటలాడాయి. ఎస్.ఎస్. కొండ సిద్దేశ్వరస్వామి ఆలయంలో లింగోద్భవం, కొత్త కోనలో శ్రీ మల్లేశ్వర స్వామి దేవాలయంలో, గంగాధర నెల్లూరులో గంగాధరేశ్వర స్వామి ఆలయంలో, మహాదేవ మంగళంలోని మహదేవుని ఆలయంలో, వెజ్జుపల్లెలో ఆవుదేవర నందీశ్వర స్వామి దేవాలయంలో, వేల్కూర్‌లోని శివాలయంలోనూ ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకంతో పాటు అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని సందర్శించుకున్నారు. జాగరణ చేసే భక్తుల కోసం శుక్రవారం రాత్రి హరికథ కాలక్షేపం, కోలాటాలు, చెక్కభజనలతో భక్తులను అలరించారు.

సోమల: శివరాత్రి సందర్భంగా శుక్రవారం మండలంలోని అన్ని శివాలయాలలో భక్తుల శివనామస్మరణతో మారుమ్రోగాయి. సోమల ఇరికిపెంట కందూరు నంజంపేట మల్లేశ్వరపురం దుర్గంకొండ ప్రాంతాలలోని శివాలయాలలో ఉదయం నుండి అర్చకులు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. భక్తులు ఉదయం నుండే శివాలయాలకు అధిక సంఖ్యలో హాజరై తమ మొక్కులను తీర్చుకున్నారు. ప్రతి శివాలయం వద్ద అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం శివకోటి భజనలు ప్రత్యేక కార్యక్రమాలతో జాగరణ కార్యక్రమాలను నిర్వహించారు.

సదుం: మండలంలోని శివాలయాల్లో శుక్రవారం ఘనంగా మహా శివరాత్రి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఊటుపల్లి గ్రామం పరిధిలోని దేవళం బోడు నందు వెలసిన శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో అత్యంత వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు అరవ వాసునాధ రెడ్డి శుక్రవారం తెలిపారు. సదుం సుబ్రహ్మణ్యం స్వామి ఆలయంలోని శివాలయంలో కళ్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్ట్ చైర్మన్ నాలి కృష్ణారెడ్డి తెలిపారు. సదుం దిగువ జాండ్రపేటలోని అరుణాచలం దేవస్థానం, అమ్మగారిపల్లి సీతమ్మ గుట్ట పైన వెలిసిన శివాలయంలో, నడిగడ్డ మతుకువారిపల్లిలోని మల్లేశ్వరస్వామి గుడి, యర్రాతివారిపల్లిలోని శ్రీ కన్నెమూల దేవస్థానం ట్రస్ట్ ఆధ్వర్యంలో శివపార్వతుల కళ్యాణోత్సవం, బూరగమంద పంచాయతీ పరిధిలోని శివకోనలో అత్యంత భక్తి శ్రద్దలతో శుక్రవారం రాత్రి మహా శివరాత్రి వేడుకలు నిర్వహించారు.

చిత్తూరుడెస్క్: నగరి మండలంలోని తడుకుపేట గ్రామంలోని సత్యసాయి ఆలయంలోని సాయిలింగేశ్వర స్వామికి రుద్రాభిషేకం వైభవంగా జరిగింది. మహాశివ రాత్రిని పురస్కరించుకొని శ్రీ సత్యసాయి భజన మండలిలో ఓంకారం, నగర సంకీర్తన, గోపూజ, సాయి లింగేశ్వర స్వామికి రుద్రాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. బాల వికాస్ విద్యార్థులచే తల్లి తండ్రులకు పాద పూజ నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మున్సిపల్ పరిధి కీళపట్టు చంద్రమౌళీశ్వర ఆలయంలో విన్నూత్నంగా తొమ్మిది అడుగుల ఎత్తులో నిర్మించిన ఏకపాదమూర్తిని, అఘోరీల మధ్య తపస్సు చేసే మహాశివుని శుక్రవారం మంత్రి రోజా దర్శించుకున్నారు.



బంగారుపాళ్యంలో

పట్టువస్త్రాలు తీసుకొస్తున్న కృపాలక్ష్మి

పట్టువస్త్రాలు సమర్పణ

ప్రజాశక్తి-వెదురుకుప్పం: కొండమల్లీశ్వరస్వామికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఆయన కుమార్తె కృపాలక్ష్మి పట్టు వస్త్రాలను సమర్పించారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని మాంబేడు పంచాయితీ, దుద్దే రామానాయుడు కండిగ సమీపంలో వెలసిన కొండ మల్లేశ్వరస్వామి వారికి మహాశివరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. పట్టు వస్త్రాలు సమర్పించేందుకు వచ్చిన నారాయణస్వామి, కృపాలక్ష్మికి ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక దర్శన ఏర్పాటు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ మర్యాదలతో సత్కరించారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి జాగరణకు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ఎంబిబిఎస్ పట్టా

ప్రజాశక్తి-పూతలపట్టు: పూతలపట్టు మండలం బత్తలవారిపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు చొక్కా లింగంపిలై కుమారుడు పృధ్వి ఈనెల 6న నెల్లూరులోని సుబ్బారెడ్డి మెడికల్ కళాశాలలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా ఎంబిబిఎస్ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

తిరుపతి జనసేనకే..
పవన్‌కల్యాణే అభ్యర్థి..?

- టిడిపి ఆశావాహుల్లో అసంతృప్తి
- బిజెపితో పొత్తు ఎలా ఉంటుందో..

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

టిడిపి, జనసేన పొత్తులో భాగంగా తిరుపతి అసెంబ్లీ సీటును జనసేనకు కేటాయిస్తున్నట్లుగా టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెనాయుడు వెల్లడించారు. జనసేన సీటులో జనసేన అభ్యర్థులే పోటీ చేస్తారని, టిడిపి ఆశావాహులు ఆశించరాదని ఇప్పటికే అధినేత నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. అయితే బిజెపి అధినేతలతో సంప్రదింపుల నేపథ్యంలో వారూ తిరుపతి, శ్రీకాళహస్తి అసెంబ్లీను ఆశిస్తుండటం గమనార్హం. ఈ నేపథ్యంలో బుజ్జగింపుల పర్వం అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు తలనొప్పి కానుంది.

తిరుపతి ఆశావాహులు ఎం.సుగుణమ్మ, నరసింహయాదవ్, వూకా విజయకుమార్, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, జెబి శ్రీనివాస్‌లు జనసేన అభ్యర్థి గెలుపుకు సహకరించాలని ఆదేశించారు. టిడిపి అధికారంలోకి వస్తే మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మకు ఎంఎల్‌సి, మిగిలిన వారికి రాష్ట్రస్థాయిలో పదవులు ఇస్తామని బుజ్జగించినట్లు తెలుస్తోంది. అయితే వారిలో ఆశ చావలేదు. ఎలాగైనా ఎంఎల్ఎ అభ్యర్థిగా పోటీచేసి మిత్రపక్షమైన జనసేనలోకి వెళ్లేందుకు సుగుణమ్మ, వూకా విజయకుమార్, జెబి శ్రీనివాస్ ప్రయత్నించారు. జనసేన నేతలతో సంప్రదింపులు చేస్తున్నారు. బిజెపితో పొత్తు కుదుర్చుకునేందుకు టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఢిల్లీ వెళ్లిన నేపథ్యంలో వీరు వేచి ఉన్నారు. చంద్రబాబు సూచన మేరకు రాష్ట్రంలో పవన్‌కల్యాణ్ సునాయాసంగా గెలిచే సీటు తిరుపతి అని, భీమవరం, పిఠాపురం నుంచి పోటీ చేయొద్దని చెప్పడంతో ఇక్కడినుంచే 90శాతం పోటీ చేస్తారని చర్చ నడుస్తోంది. శుక్రవారం అర్ధరాత్రి బిజెపితో సహా జనసేన, టిడిపి తుది జాబితా వెల్లడయ్యే అవకాశం ఉంది. ఇక్కడ బలిజలు టిడిపి, జనసేనల్లో ఎవరు పోటీ చేసినా పవన్‌కల్యాణ్ మినహా మిగిలిన ఎవరికైనా స్థానిక బలిజలకే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. చిత్తూరు సిట్టింగ్ ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు వైసిపికి రాజీనామా చేసి జనసేన కండువా కప్పుకున్నారు. అక్కడ టిడిపి అభ్యర్థి గురజాల శ్రీనివాస్‌ను ప్రకటించడంతో తిరుపతికి వలసొచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. రాయలసీమలో తిరుపతి, రాజంపేట పార్లమెంట్, తిరుపతి, శ్రీకాళహస్తి అసెంబ్లీ స్థానాలు కావాలని బిజెపి కోరినట్లు తెలుస్తోంది. అయితే చంద్రబాబు అరకు, రాజంపేట, తిరుపతి, అనకాపల్లి పార్లమెంట్ నుంచి పోటీ చేయాలని, తిరుపతి అసెంబ్లీ జనసేనకు ఇస్తామని బిజెపి అధినేతలకు వివరించినట్లు సమాచారం. ఒకవేళ పవన్‌కల్యాణ్ పోటీ చేయకపోతే డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, కిరణ్‌రాయల్ పేర్లు వినిపిస్తున్నాయి. మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ మాత్రం జనసేన కండువా కప్పుకుంటే ఆమె పేరూ వినిపిస్తోంది. ఏదిఏమైనా టిడిపి, జనసేన, బిజెపి పొత్తులో భాగంగా తుది జాబితా అర్ధరాత్రి ప్రకటించే అవకాశం ఉంది. శ్రీకాళహస్తిలో బిజెపి నుంచి కోలా ఆనంద్‌కు ఇవ్వాలని పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది.

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

అంగన్వాడీలను సన్మానిస్తున్న హెచ్ఎం హేమలత

పలువురి మహిళలను సన్మానిస్తున్న తెలుగు సాహిత్య సంస్కృతి సమితి కార్యదర్శి పుష్ప

కేక్ కట్ చేస్తున్న ఏఎస్పీ ఆరిఫుల్లా

ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఇరికిపెంట పంచాయతీ మేటిమంద ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం లత ఆధ్వర్యంలో గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో టీచరుగా పనిచేస్తున్న దాక్షవేణి, వంటలమ్మ జయమ్మ, ఆయా మహాలక్ష్మిలకు సన్మానం చేశారు. విద్యార్థుల ఆధ్వర్యంలో వారి సేవలను కొనియాడారు.

గంగవరం: మహిళలు చైతన్యవంతులైనప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని తెలుగు సాహిత్య సంస్కృతిక సమితి కార్యదర్శి పుష్ప అన్నారు. శుక్రవారం గంగవరం పంచాయతీ సాయినగర్‌లో మహిళా దినోత్సవం సందర్భంగా కళామందిర్లులో మహిళా సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వలంబము అవలంభించి ఆర్థిక అభివృద్ధి సాధించినప్పుడే సమాజంలో గౌరవంతో పాటు తన కుటుంబం కూడా అభివృద్ధి చెందుతుందని సమాజంలో ఇప్పటికీ మహిళల పట్ల కొన్నిచోట్ల గౌరవం దక్కలేదని అందుకే మహిళలు అన్ని రంగాలలో రాణించినప్పుడే మహిళలకు స్వేచ్ఛ స్వాతంత్రం ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా పలు రంగాలలో ఉన్న మహిళలకు సన్మాన కార్యక్రమం నిర్వహించి బహుమతులు అందజేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో కళామందిర్వాహకులు తులసి, నారాయణనాయుడు, పలు రంగాల మహిళలు పాల్గొన్నట్లు తెలియజేశారు.

చిత్తూరు అర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని పోలీస్ శాఖ ఘనంగా మహిళా దినోత్సవం నిర్వహించి మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. పోలీస్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఈ హెల్త్ చెకప్ క్యాంపు నందు పోలీసు ఉద్యోగులు, పోలీసు కుటుంబాల యందు 35 సంవత్సరాలు పైబడిన 100మంది మహిళలకు ఉచితంగా డయాబెటిస్, ఆర్థోపెడిక్, డెంటల్ మరియు గైనకాలజీ పరీక్షలు నిర్వహించారు. ముఖ్యఅతిధిగా విచ్చేసిన జిల్లా అడిషనల్ ఎస్పీ ఆరిఫుల్లా మహిళలచే కేక్ కట్ చేపించి ప్రారంభించారు. అడిషనల్ ఎస్పి మాట్లాడుతూ సేవా దృక్పతంతో పోలీసు ఉద్యోగులు, వారి కుటుంబాల మహిళలకు ఉచిత హెల్త్ చెకప్ పరీక్షలు నిర్వహించడానికి సమ్మతించి వచ్చిన అపోలో ఆసుపత్రి వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మఠం భూముల ఆక్రమణలో...
అసలు సూత్రధారి ఎవరు..?

- కబ్జాలపర్వంలో పేదలే సమిధలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

దేశవ్యాప్తంగా ఏ మఠానికీ లేనన్ని భూములు శ్రీ స్వామి హథీరాంజీ మఠానికి మాత్రమే ఉన్నాయి. దశాబ్దాలుగా మఠానికి చెందిన భూములపై రాజకీయ నాయకుల పెత్తనం పెరుగుతుండడంతో మఠానికి చెందిన భూములు క్రమేపి అన్యాక్రాంతమవుతూ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. అర్జున్ దాస్ మహంతుగా బాధ్యతలు తీసుకోక ముందు హథీరాంజీ మఠం రాష్ట్ర ప్రభుత్వ దేవాదాయ శాఖ ఆధీనంలో ఉండేది. హాథీరాంజీ మఠం భూములు రాజకీయ నాయకులు అన్యాక్రాంతం చేస్తున్నారని అర్జున్ దాస్ రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అన్యాక్రాంతం వాస్తవమేనని తేల్చిన కోర్టు అర్జున్ దాస్ ను మఠానికి మహంతుగా నియమిస్తూ మఠం పాలన వ్యవహారాలతో పాటు, మఠం ద్వారా జరిగే ధార్మిక కార్యక్రమాలను నిర్వహించేలా అధికారాలు ఇవ్వాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కు ఉత్తర్వులు జారీ చేసింది.

మఠం భూముల్లో రాజకీయ జోక్యం

అర్జున్ దాస్ మహంతుగా పదవీ బాధ్యతలు చేపట్టాక అన్యాక్రాంతమైన ఒకటి, రెండు మఠం భూములను స్వాధీనం చేసుకోవడంతో రాజకీయ జోక్యాలు మొదలయ్యాయి. ఆనాటి నుండి మఠం మహంతుగా అర్జున్ దాస్ రాజకీయ జోక్యాలకు తలొగ్గి అక్రమార్జనకు పెట్టుబడిగా మార్చేసుకున్నారు. ఈ క్రమంలో మఠం భూములు వ్యవసాయ వినియోగానికి లీజు ప్రతిపాదికన కేటాయింపులు చేయించుకొని, దానిపై కోర్టుల్లో పిల్ వేసి ఎలాగైనా లీజు ద్వారా పొందిన మఠం భూమిని సొంతం చేసుకోవాలని కొందరు ప్రయత్నిస్తున్నారు. మఠం భూములను లీజుకు పొందిన వారు సకాలంలో లీజు నగదును చెల్లించక మఠం ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తూ వచ్చారు.

భూముల ఆక్రమణ వెనుక ఉన్నదెవరు..?

తుమ్మలగుంట మఠం భూముల్లో అధికార పార్టీ నాయకుల అండదండలతో చోటా మోటా నాయకులు ల్యాండ్ మాఫియాగా ఏర్పడి లక్షల రూపాయల వరకు ఒక్కో ఫ్లాటు అమ్మారని బహిరంగంగా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే క్రమంలో మఠం ఫిట్ పర్సన్ రమేష్ నాయుడు బుధవారం తెల్లవారుజామున తొలగించిన ఇళ్ల వద్ద వారిని మీకు ఈ స్థలం ఎవరు అమ్మారు?... మీరు కొన్న డాక్యుమెంటు మాకు అందిస్తే మేము వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పిన ఎవరూ స్పందించలేదని మీడియాతో చెప్పారు.

అధికారపార్టీ నాయకుల జోలికి వెళ్లరే.....

తుమ్మలగుంటలో అధికార పార్టీ నాయకులు ఐదు సెంట్లు నుంచి ఆరు సెంట్లుపైగా స్థలాన్ని ఆక్రమించి షెడ్లు నిర్మిస్తున్నారని, మఠం అధికారులు వాటి జోలికి ఎందుకు వెళ్లరని ప్రతిపక్ష టిడిపి ప్రశ్నల వర్షం కురిపిస్తోంది. ఇదే క్రమంలో పుదిపట్ల సర్పంచి బడి సుధా యాదవ్ కూడా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి పేరిట హాథీరాంజీ మఠం భూమి రిజిస్ట్రేషన్ అయ్యి ఉందని, సదరు మఠం స్థలంలో అధికారులు మఠంకు చెందిన భూమిగా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

దిక్కుతోచని స్థితిలో పేదలు.....

బుధవారం తుమ్మలగుంటలో జరిగిన కూల్చివేతల్లో అంతో ఇంతో సొమ్ము పెట్టుకుని కొనుక్కున్న స్థలాలలో నిర్మించుకున్న ఇళ్లను అధికారులు జెసిబి యంత్రాల సహాయంతో కూల్చివేయడంతో పేదలు లబోదిబోమంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. మరోవైపు అధికార వైసీపీలోనే కొందరు తమది కూడా కొట్టేసారంటూ మోహిత్ రెడ్డి ఎదుట ఆగ్రహం వ్యక్తం చేస్తూ దుర్భాషలు ఆడినట్టుగా సమాచారం. మోహిత్ రెడ్డి నచ్చజెప్పే ప్రయత్నం చేసిన ఫలితం లేకుండా పోయింది. మీకు తెలియకుండా అధికారులు వస్తారా అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. టిడిపి పార్టీకి చెందిన వారు కూడా ఇళ్ల కూల్చివేతను అడ్డుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీనిపై మఠం స్థలాన్ని కొనుక్కోవద్దని మఠం ఫిట్ పర్సన్ రమేష్ నాయుడు పదే పదే చెబుతున్నా పట్టించుకోకపోవడం తోనే ఇంత నష్టం వాటిల్లుతోందని మఠం సిబ్బంది చెబుతున్నారు. అంతిమంగా నష్టపోయింది మాత్రం పేదలే.

పేదలకు జగనన్న ఇంటి పట్టాలు రాలేదా.....

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నవరత్నాల పథకంలో భాగంగా పేదలందరికీ ఇంటి స్థలాలు పథకం అమలు చేస్తోంది. ఎమ్మెల్యే స్వగ్రామమైన తుమ్మలగుంటలో పేదలంటూ ఇల్లు నిర్మించుకున్నామని చెబుతున్న వారికి ఇక్కడి అధికార పార్టీ నాయకులు జగనన్న ఇంటి పట్టాలు వచ్చేలా చర్యలు తీసుకోలేదా?.... జాతీయ రహదారికి సమీపంలో ఉన్న మఠం భూములను అడ్డాగా చేసుకొని తక్కువ ధరకు పేదలంటూ చెబుతున్న వారికి అమ్మేసారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కానీ మఠం భూముల్లో ప్రస్తుతం ఇల్లు కూల్చిన ప్రదేశంలో మళ్ళీ కట్టడాలు జరుగుతున్నట్టుగా తెలుస్తోంది. పేదల ముసుగులో అధికార పార్టీకి చెందినవారు ప్రభుత్వ సెలవు దినాల్లో ఎడాపెడా అక్రమ నిర్మాణాలు జోరుగా సాగిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

రేపు మైనార్టీల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండలంలోని మైనార్టీలతో ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అరగొండ రోడ్డులోని ఎస్ఎల్‌వి కళ్యాణ మండపం సమీపంలో జరుగుతుందని పేర్కొన్నారు. మైనార్టీలు కార్యక్రమానికి పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

213 కంటి అద్దాలు మంజూరు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పలువురికి కంటి చికిత్సలు చేశారు. అవసరమైన 213మందికి అద్దాలు మంజూరు చేయాలని కోరుతూ అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. కాగా 213 కంటి అద్దాలు శుక్రవారం సోమల ఆసుపత్రికి చేరాయి. వీటిని కంటి వైద్య నిపుణులు నరసింహులు సీహెచ్‌వో అమర్నాథ్‌కు అందజేశారు. కందూరు ఆసుపత్రి పరిధిలో 66, పెద్దఉప్పరపల్లి41, సోమల57 చొప్పున కంటి అద్దాలు వైద్య సిబ్బందికి అందజేసి త్వరలో పంపిణీ చేయనున్నట్లు సీహెచ్‌వో తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం గీత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శరీరానికి వ్యాయామం అవసరం

ప్రజాశక్తి-వెదురుకుప్పం: ప్రతి మనిషి శరీరానికి వ్యాయామం ఎంతో అవసరమని నెహ్రూ యువ కేంద్ర, అమ్మ యూత్ అసోసియేషన్ ఉపాధ్యాయులు విజయ్, జాకబ్, నరేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని అయ్యన్నగారిపల్లెలో వాల్లీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. 12జట్లు తలపడగా అందులో చవటగుంట జట్టు మొదటి స్థానం కైవసం చేసుకోగా అయ్యానగారిపల్లి జట్టు రెండవ స్థానంలో నిలిచింది. అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశులు నేతృత్వం వహించారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: ప్రమాధాలతోను, ఆరోగ్య పరిస్థితుల కారణంగానో బాధింపబడిన కుటుంబాలకు ఆపద్భందులా సీఎం సహాయనిధి నిలుస్తోందని, బాధిత కుటుంబాల్లో వెలుగులు నింపుతోందని మంత్రి రోజా అన్నారు. శుక్రవారం తన నివాస కార్యాలయం వద్ద 7మందికి రూ.39లక్షల సీఎం సహాయనిధి చెక్కులను ఆమె అందజేశారు.

రేపు శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ఆవిష్కరణ

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు నగర సమీపంలోని గంగినేని చెరువు వద్ద ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాన్ని ఈనెల 10న ఆదివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆవిష్కరించనున్నట్లు బలిజ సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో సంఘం నాయకులు నందగోపాల్, మధుసూదన్ రాయల్, అపోజి మాట్లాడుతూ కృష్ణదేవరాయలు విగ్రహం ఏర్పాటు కోసం వైసీపీ అభ్యర్థి ఎంసి విజయానందరెడ్డి స్థానిక గంగినేని చెరువు వద్ద ప్రభుత్వంతో మాట్లాడి స్థలాన్ని కేటాయించడం కోసం ఎంతో కృషి చేశారని తెలిపారు. తన సొంత నిధులు రూ.30లక్షలతో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కృష్ణదేవరాయలు విగ్రహ ఏర్పాటుకు ఎంతో సహకరించిన విజయానందరెడ్డికి బలిజ కులస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో బలిజలు వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డిని బలపరుస్తున్నట్లు చెప్పారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో అగ్నిప్రమాదం

- అప్రమత్తమై మంటలు ఆర్పిన స్థానికులు
- తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-వికోట: ఓ ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌కు గురై అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న సంఘటన శుక్రవారం వికోట మండల కేంద్రంలోని కేజీఎఫ్ రోడ్డులోని ఓ భవనం వద్ద చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ సమీపంలోని డిఆర్‌కె భవంతిలో శుక్రవారం షార్ట్ సర్క్యూట్‌తో మండలు వ్యాపించాయి. దీంతో ఆ ఇంట్లో భారీ ఎత్తున అగ్ని కీలలు ఎగసిపడ్డాయి. అప్రమత్తమైన స్థానికులు, ఆ ఇంట్లోని వారు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. వీకోటలో ఫైర్ ఇంజన్ అందుబాటులో లేకపోవడంతో స్థానికులు తీవ్ర ప్రయత్నం చేసి మంటలు ఆర్పారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటనకు గల కారణాలను పరిశీలించారు. సుమారు రూ.2లక్షల వరకు ఆస్తి నష్టం ఉంటుందని అంచనా.

గంజాయి ముఠా అరెస్ట్

నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: గంజాయి ముఠాను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 6.5కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం అందిన సమాచారం మేరకు సంతపేట ఇందిరానగర్ వద్ద సీఐ ఉలసయ్య, సిబ్బందితో సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. అరవింద్ అలియాస్ అప్పు, రవితేజ అనే ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వారి వద్ద రూ.2.50లక్షల విలువైన 6.5కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అప్పు అనే వ్యక్తి వైజాగ్ ఏజెన్సీ ఏరియా నుంచి గంజాయిని అక్రమంగా కొనుగోలు చేసి చిత్తూరుకి అక్రమ రవాణా చేస్తున్నారని విచారణలో తేలిందన్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు. ఆటో రవి అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. గతంలో పట్టుబడిన పాండియన్ బృందం ఇప్పుడు జైల్లో శిక్ష అనుభవిస్తున్నారన్నారు. అక్రమంగా గంజాయి మద్యం రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

టీడీపీలో చేరుతున్న పలువురు నాయకులు

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: మండలం లోని గారంపల్లెలోని వైసీపీకి చెందిన మాజీ సర్పంచ్ మహదేవన్‌తో పాటు 14మంది బీసీ నేతలు శుక్రవారం టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ జీడీ నెల్లూరు అభ్యర్థి డాక్టర్ థామస్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం జనసేన నేత పొన్నా యుగంధర్‌తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో కృష్ణమ నాయుడు, వెంకటేష్, శ్రీధర్ యాదవ్, స్వామి దాస్, దేవసుందరం, ప్రసాద్ నాయుడు, నరసింహులునాయుడు, చంద్రబాబు గౌడ్, దీపక్ చౌదరి, శరవణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చొరవతోనే పుంగనూరు అభివృద్ధి: పెద్దిరెడ్డి

సభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి-పుంగనూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతోనే పుంగనూరు నియోజకవర్గం ఐదేళ్లుగా ఎంతో అభివృద్ధి చేశామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. పుంగనూరులో రూ.2.35కోట్లతో నూతనంగా నిర్మించిన జెడ్పీ అతిథి గృహాన్ని శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ఎంపిలు రెడ్డెప్ప, మిథున్‌రెడ్డి, అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరైయ్యారు. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ అర్హత గల ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ది చేకూరే విధంగా పాలన సాగిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి రాజంపేట ఎంపి చొరవతో పుంగనూరుకు బైపాస్ రోడ్డు మంజూరు కావడం జరిగిందని, ఈ పనులు జరుగుతున్నాయని, దీనితో పాటు పట్టణ సుందరీకరణ పనులు చేయడం, మౌలికసదుపాయాల కల్పనలో భాగంగా ప్రతి గ్రామానికి సీసీ రోడ్లు, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టామనన్నారు. కార్యక్రమంలో పుంగనూరు మండలంలో 146మంది లబ్దిదారులకు అసైన్మెంట్ భూములకు సంబంధించిన పట్టాలను పంపిణీ చేశారు. అధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, గ్లోరియా, ప్రభాకర్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విమర్శలు చేస్తే సహించం

- ఎమ్మెల్యేకు వైసీపీ నేతల వార్నింగ్

మీడియాతో మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: అమ్మలాంటి వైసీపీని విమర్శించే అర్హత చిత్తూరు ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులుకు లేదని మహిళా నాయకురాలు గాయత్రీదేవి, మార్కెట్ కమిటీ అధ్యక్షులు రాహుల్ రాజారెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞాన జగదీష్, కార్పొరేటర్ గడ్డం రమణలు ఎమ్మెల్యే శ్రీనివాసులు వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యే వివిధ పార్టీలలో పనిచేసినప్పటికీ చిత్తూరు టికెట్టు ఇవ్వకపోవడంతో నిరాశ చెంది వైసీపీలో చేరితే వైఎస్ జగన్మోహన్ రెడ్డి చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా అవకాశం ఇచ్చి గెలిపించారని తెలిపారు. సామాజిక సమీకరణలో భాగంగా ఆరని శ్రీనివాసులకు టికెట్టు రాకపోవడంతో ఆయన వేరే పార్టీలో చేరడం జరిగిందన్నారు. రాజకీయ బిక్ష పెట్టిన అమ్మలాంటి పార్టీని విమర్శించి లబ్ది పొందేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారన్నారు. ఐదు సంవత్సరాలుగా ఎమ్మెల్యే ప్రజలకు ఎలాంటి అభివృద్ధి చేయలేదని తన స్వార్ధ ప్రయోజనాల కోసం అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. వైసీపీని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్ రాజారెడ్డి హెచ్చరించారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిగత విమర్శలు దారుణం

- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి విజయబాబు

మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చిత్తూరు నియోజకవర్గ టిడిపి అభ్యర్థి గురజాల జగన్మోహన్‌పై వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డి వ్యక్తిగత విమర్శలు చేయడం దారుణమని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజాసేవే పరమావధిగా భావించే వ్యక్తి గురజాల జగన్మోహన్ అన్నారు. వ్యాపారాల్లో న్యాయబద్ధంగా సంపాదించారని తెలిపారు. విజయానందరెడ్డి పెద్ద స్మగ్లర్, గజదొంగ అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. లారీ క్లీనర్‌గా జీవితం ప్రారంభించి హెరాయిన్ బీరు ఫ్యాక్టరీలకు బియ్యాన్ని అక్రమంగా సరఫరా చేసి దొంగ చాటుగా కోట్లాది రూపాయలు సంపాదించిన విషయం నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసన్నారు. అలాంటి అవినీతి వ్యక్తి, మంచి వ్యక్తిగా పేరున్న టీడీపీ అభ్యర్థితో పోటీ పడటం బాధాకరంగా ఉందన్నారు. గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ.. లోకల్, నాన్ లోకల్ సమస్య లేవనెత్తే అర్హత తమ ప్రత్యర్థి అభ్యర్థికి లేదన్నారు. తాను స్థానికుడని, నిజాయితీగా వ్యాపారాలు చేసి పన్నులు చెల్లించానని తెలిపారు. విజయానందరెడ్డి నిజాయితీగా సంపాదించి ఉంటే ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ప్రమాణానికి సిద్ధంగా ఉండాలని సవాల్ విసిరారు. సమావేశంలో నాయకులు కోదండయాదవ్, కాజూరుబాలాజీ, సీఎంటీఎస్ త్యాగరాజులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమల నడకదారిలో టెన్షన్!

7వ మైలులో దుకాణం ఏర్పాటు, తొలగింపు

షెడ్డును తొలగించిన దృశ్యం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుమల కాలి నడక మార్గంలో అటవీశాఖ భూ పరిధి ఏడవ మైలు వద్ద ఇటీవల అటవీశాఖ జారీ చేసిన అనుమతులతో స్థానికంగా అలజడి సృష్టించారు. 30 మందికి అటవీశాఖ దుకాణాల నిర్వహణకు అనుమతులు జారీ చేసిన క్రమంలో క్షేత్ర స్థాయిలో ఎప్పటి నుండో దుకాణాలు నిర్వహిస్తున్న వారు తమ వ్యాపారాలు దెబ్బతింటాయని, అసలు స్థానికేతరులకు ఎలా దుకాణాల నిర్వహణకు అటవీశాఖ అధికారులు అనుమతులు ఇస్తారని ప్రశ్నించారు. అటవీశాఖ మంత్రి పిఏ తుకారాం అనుచ రుడిని అంటూ స్థానికంగా ఉన్న దుకాణదారులకు చెప్పుకుంటూ ప్రసాద్ అనే వ్యక్తి శుక్రవారం ఉదయం కొత్తగా రేకులతో షెడ్డు వేయడానికి ప్రయత్నించడంతో స్థానికంగా ఘర్షణ ఏర్పడింది. సమీపంలో స్థానిక దుకాణాలు నిర్వ హిం చు కునేవారు ఈ షెడ్డు నిర్మాణాన్ని అడ్డు కున్నారు. అధికారులు ఇప్పటికైనా ఆలోచించి స్థానికేతరులకు కేటాయించిన దుకాణా లను వెంటనే రద్దు చేయాలని 7వ మైలు వద్ద ఉన్న స్థానిక దుకాణ దారులు డిమాండ్ చేస్తున్నారు.

స్నాతకోత్సవానికి విద్యాశాఖ మంత్రికి ఆహ్వానం

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం విసి ఆచార్య జి.ఎస్.ఆర్ కృష్ణమూర్తి న్యూఢిల్లీలోని భారతదేశ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ని ఆయన నివాసంలో కలిసి వర్సిటీ స్నాతకోత్సవానికి హాజరు కావాలని కోరారు. విశ్వవిద్యాలయంలోని ఉత్కల పీఠం రజతోత్సవ కార్యక్రమానికి ఆన్లైన్ మాధ్యమంలో విచ్చేసిన సందర్భంగా ఆయనకు ధన్యవాదాలు తెలిపి, జ్ఞాపికలను, ఆవిష్కరించిన ఉత్కలపీఠం వైశిష్ట్య సంబంధించిన గ్రంథాలను అందిందించారు.

స్పార్క్-2024 విజేతగా అక్షిత

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ప్రథమ, ద్వితీయ తతీయ సంవత్సర విద్యార్థినీ విద్యార్థులకు స్పార్క్-24 పేరిట స్పీచ్ కాంపిటీషన్ ను నిర్వహించగా స్పార్క్-2024 విజేతగా బీకాం విద్యార్థిని అక్షిత నిలిచారు. 150 మంది విద్యార్థిని విద్యార్థులు వీడియో ప్రజెంటేషన్, ఎక్స్టెంపోర్, గ్రూప్ డిష్కషన్ తదితర విభాగాలలో విద్యార్థులు తమ ప్రతిభను చూపి 17 మంది ఫైనల్స్ కు అర్హత సాధించారని కళాశాల సంచాలకులు గిరిధర్, విశ్వనాథ్ లు తెలిపారు. అంతిమ పోటీలలో ప్రతి విద్యార్థి నేటి ప్రపంచ పరిస్థితులు, ప్రకతి పరిరక్షణ, నీటి ప్రాముఖ్యత, మంచి అలవాట్లు, చైల్డ్ లేబర్ వంటి అంశాలను తెలియజేశారు. మొదటి స్థానంలో నిలిచిన అక్షిత కు 5 వేల రూపాయల నగదుతో పాటు, ఉత్తమ ప్రశంసా పత్రం, షీల్డ్, ద్వితీయ స్థానంలో రుక్సాణకు రూ.3000, తతీయ స్థానంలో శ్రావణి వెయ్యి రూపాయల నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రం, షీల్డ్ ను కళాశాల సంచాలకులు గిరిధర్, విశ్వనాథ్ లచే అందజేశారు.

ఆర్థిక సాయం అందజేత

బాధిత కుటుంబానికి భరోసా కల్పిస్తున్న స్నేహితులు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: తన చిన్ననాటి స్నేహితుడు మృతి చెందడంతో ఆ కుటుంబానికి స్నేహితులంతా కలిసి ఆర్థిక సాయం అందజేశారు. వెదురుకుప్పం మండలం తార్లభయలు గ్రామానికి చెందిన ఈ నెల 3న కేశవులురెడ్డి ప్రమాదంలో మృతి చెందారు. అతనితో కలిసి 10వ తరగతిలో చదువుకున్న స్నేహితులంతా కలిసి ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందజేశారు. కేశవరెడ్డి పిల్లల పేరిట ఈ సొమ్మును ఫిక్సిడ్ డిపాజిట్ చేశారు. వారికి ఏ సహాయం కావాలన్నా ముందుంటామని భరోసా కల్పించారు.

ముస్లింలపై దాడి హేయం: కాంగ్రెస్

ప్రజాశక్తి-పుంగనూరు: ఢిల్లీలో ముస్లింలను కొట్టడం సిగ్గుచేటు అని, బిజెపి పరిపాలన పరాకాష్టకు చేరిందని పుంగనూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ ఎస్.సజాద్ బాషా అన్నారు. దేశ రాజధానిలో శుక్రవారం ముస్లింలు నమాజ్ చేస్తున్న సందర్భంగా పోలీసులు జరిపిన దాడిని తీవ్రంగా ఖండించారు. కేవలం 10నిమిషాల్లో శాంతియుతంగా నమాజు చేసు కుంటూ వెళ్లిపోయే ముస్లింలను నమాజ్ చేస్తున్న సమయంలో కొట్టడం సిగ్గుచేటు అని బిజెపికి పోయేకాలం దాపురించిందని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో తప్పకుండా వారికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని దానికి దేశ ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వంట గ్యాస్ పైన రూ.100 తగ్గించడం ఎన్నికల స్టంట్ మాత్రమే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇచ్చే విధంగా రూ.500 సిలిండర్ గ్యాస్ ఇవ్వాలని బిజెపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో ఎన్నడూ చూడని వికృత చేష్టలు బిజెపి పరిపాలనలో దేశ ప్రజలు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

చలగానిపల్లెలో తాగునీటి సమస్య

నిరుపయోగంగా వాటర్ ట్యాంకు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని వేలుపల్లి గ్రామపంచాయతీ పరిధి లోని చలగానిపల్లిలో సుమారు 70కుటుంబాలకు పైగా ఉన్నాయి. ఆ పల్లె వాసులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమీప బోరు బావుల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. గ్రామంలో మూడు ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నా పట్టించుకోవడం లేదని అక్కడి మహిళలు మండిపడుతున్నారు. ఇకనైనా స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సోలార్ వీధి దీపాలు ఏర్పాటు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని మూడు పంచాయతీల పరిధిలో ప్రభుత్వ నిధులతో మంత్రి పెద్దిరెడ్డి ఆదేశాలతో సోలార్ వీధి దీపాలను ఏర్పాటు చేస్తున్నట్లు ట్రాన్స్కో అధికారి మహేందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల మంత్రి సోమల మండల పర్యటనలో పలువురు ప్రజలు మంత్రికి సోలార్ వీధి దీపాల ఏర్పాటు కోసం విన్నవించినట్లు చెప్పారు. స్పందించిన ఆయన వెంటనే సోమల, ఇరికిపెంట, ఎస్.నడింపల్లి పంచాయతీల పరిధిలో 40సోలార్ వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు వివరించారు. ఒక్కొక్క సోలార్ వీధి దీపం రూ.64వేల విలువ చేస్తుందని అలాంటివి మొత్తం మూడు పంచాయతీలలో 40ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శుక్రవారం ఇరికిపెంట పంచాయతీలో పలు ప్రాంతాలలో ప్రధాన కూడళ్లలో దేవాలయాల వద్ద సోలార్ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశామన్నారు.

ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ దీపాలు

విమర్శలు అవాస్తవం: మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు అసెంబ్లీ నియోజకవర్గం వైసీపీ ఇన్‌ఛార్జి మేరిగ మురళీధర్ ఎన్ని రాజకీయ పార్టీలు మారి ప్రస్తుతం వైసీపీలో ఉన్నారో గుర్తు తెచ్చుకుని ఇతరులపై విమర్శలు చేయాలని గూడూరు అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి సునీల్ కుమార్ పేర్కొన్నారు. గూడూరు లోని టిడిపి కార్యాలయంలో సునీల్ కుమార్ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ గూడూరు వైసీపీ ఇన్‌ఛార్జి మేరిగ మురళీధర్ చేసిన వ్యాఖ్య లను తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పట్టు వస్త్రాలు సమర్పణ

ప్రజాశక్తి- యర్రావారిపాలెం: మహాశివరాత్రి పురస్కరించుకొని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి,తుడా చైర్మన్ మోహిత్ రెడ్డి ప్రతి ఏటా సాంప్రదాయంగా తలకోన సిద్దేశ్వర స్వామికి సారెతో పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చు కున్నారు. పాలకమండలి ఛైర్మన్, సభ్యులు, సిబ్బంది స్వాగతం పలికి ప్రత్యేక పూజ లు, అభిషేకాలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బం దులు కలగకుండా దర్శనం చేసి పంపాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి అధికారులను ఆదేశించారు.

కల్కి ఆశ్రమ నిర్వాహకులను ప్రాసిక్యూట్ చేయాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

చిత్తూరు జిల్లా వరదయ్యపాలెం వద్ద డీకేటి పట్టాల భూములను, అటవీశాఖ భూములను ఆక్రమించి తనను తానుగా దేవుని అని చెప్పుకొని మోసం చేస్తూ వేలకోట్లకు పడగలెత్తిన కల్కి భగవాన్ (విజయ్ కుమార్) ఆశ్రమ నిర్వాహకులను ప్రాసిక్యూట్ చేయాలని రాష్ట్ర హైకోర్టు ఆదేశించిందని ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం ఉపాధ్యక్షుడు నార్నే వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ దాదాపు 16 సంవత్సరాలు గడిచిన తర్వాత రాష్ట్ర హైకోర్టు కల్కి భగవాన్ ఆశ్రమ యాజమాన్యాన్ని ప్రాసిక్యూట్ చేయాలని తీర్పు చెప్పిందన్నారు. తనను తాను భగవంతుడిగా సష్టించుకున్న కల్కి భగవాన్ ను చూడాలంటే 25 వేలు, కాళ్ళు తాకాలంటే 50 వేల నుండి లక్ష రూపాయలు తీసుకుంటూ దోపిడీలకు పాల్పడుతున్నారని, భక్తి ముసుగులో ఆశ్రమంలో దాసాజీలు మత్తు పదార్థాలు తీసుకుని చిత్ర విచిత్రమైన వేషాలు వేయడం, గతంలో టీవీలలో చూశామని, హైకోర్టు స్టేను వికెట్ చేయించాల్సిన బాధ్యత కలెక్టర్‌పై ఉందని, భక్తి ముసుగులో ఇంతకాలం మోసం చేస్తున్న కల్కి భగవాన్ పై చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను కోరారు. ఈ విలేకరుల సమావేశంలో డాక్టర్ ఏ ఆర్ రెడ్డి, హేతువాద నాయకులు కోటేశ్వరరావు, రామ్మూర్తి రెడ్డి పాల్గొన్నారు.

మహిళా పక్షపాతి టిడిపి

ఎంపీటీసీ ఆరూరు భార్గవి

ప్రజాశక్తి -చిట్టమూరు: టిడిపితోనే అభివృద్ధి సాధ్యం అని, సునీల్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకుని గూడూరు నియోజక వర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని ఎంపీటీసీ ఆరూరు భార్గవి అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఆమె మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల పక్షపాతి టిడిపి అని తమ పార్టీని ఆదరించాలని ఆమె కోరారు. మహిళలంటే సమాజ శక్తిలో మహిళలు సగం అన్నారు. మహిళలను తోబుట్టువుల్లా చూసిన ఏకైక పార్టీ టిడిపి అని గుర్తు చేశారు. మహిళల ఆత్మగౌరవాన్ని నిలబెట్టి, వారిలో ఆత్మవిశ్వాసం నింపి, ఆర్థిక స్వావలంబనకు నిరంతరం పని చేసింది టీడీపీనే అన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి మహిళలకు అగ్రపీటం వేస్తోందన్నారు. నందమూరి తారకరామారావు తెలుగింటి ఆడపడుచులకు ఎనలేని గౌరవం ఇచ్చేవారని. అదే ఒరవడిని ప్రస్తుతం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ఆవిర్భావం నుంచే రాజకీయాల్లో మహిళల ప్రాధాన్యం ఇచ్చారని, డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించే దిశగా తీర్చిదిద్దిన ఘనత టిడిపికే దక్కుతుందన్నారు.ఒక తల్లిగా, ఒక సోదరిగా, ఒక భార్యగా, ఒక స్నేహితురాలిగా మహిళలు పురుషుల జీవితంలో ఎంతో గొప్ప పాత్రను పోషిస్తున్నారన్నారన్నారు. వారి జీవితాన్ని తమ కుటుంబం కోసం, సమాజం కోసం అంకితం ఇస్తున్నారన్నారు. అలాంటి స్త్రీమూర్తులందరికీ గౌరవించేలా మహిళా దినోత్సవం రోజును జరుపు కోవాలన్నారు. మహిళా దినోత్సవం స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. అందరి మద్దతుతో త్వరలో ఏర్పడే టీడీపీ-జనసేన ప్రభుత్వంలో మీకు అభివృద్ధి, భద్రత కల్పించి మహిళల పక్షాన నిలబడుతుందన్నారు. టిడిపి మేనిఫెస్టోను వివరించారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గ అభివృద్ధికి చంద్రబాబునాయుడుని, పాశం సునీల్ కుమారుని గెలిపించాలని కోరారు.

బిసిలను ఆదుకుంటాం: గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : బీసీ లకు 50 ఏళ్లకే పించన్ మంజూరు చేసి, ప్రస్తుత పించన్ రు.4 వేలు పెంచుతామని, బీసీలను అన్నీ విధాలుగా ఆదుకుంటామని నగరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ భరోసా ఇచ్చారు. వడమాలపేట మండలం ఎనమలపాళెంలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ'లో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఓటేసి టిడిపి-జనసేన ప్రభుత్వం ఏర్పాటుకు సహకరించాలని కోరారు. బీసీలకు సబ్ ప్లాన్ నిధులు పునరుద్ధరించి ఐదేళ్లలో లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తామని, రద్దయిన పథకాలను పునరుద్ధరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సుబ్రమణ్యంరెడ్డి, పార్దు, మండల నాయకులు జానా వెంకటయ్య, హేమావతి, ధనంజేయులు నాయుడు, లక్ష్మీ ప్రసన్న, శివ, దేవ, వెంకటేశ్వర రావు, అంజయ్య, రఘు, జనసేన నాయకులు మెరుపుల మహేష్, మునిశేఖర్ పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి-బుచ్చి నాయుడు కండ్రిగ: మహాశివరాత్రి పర్వదినాన్ని మండలం లోని 28 గ్రామ పంచాయతీ ప్రజలు ఘనంగా నిర్వహించారు. మండలం లోని సిద్ధేశ్వర కోనలో శుక్రవారం రాత్రి శివరాత్రిని ఘనంగా నిర్వహించారు. తమిళనాడు , ఆంధ్ర రాష్ట్రాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. మండలంలోని పెద్దపాలవేడులో సోమలింగేశ్వరునికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు గ్రామస్థులు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం కల్పించారు. ఈ కార్యక్రమం ఆలయ నిర్వాహకులు సుధాకర్ రెడ్డి, గ్రామస్థులు, కాలనీ పెద్దల పర్యవేక్షణలో ప్రశాంతంగా జరిగాయి.

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రోటరీ క్లబ్ వెస్ట్ వారోత్సవాల్లో భాగంగా గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో మయూరి శ్యామ్ యాదవ్ , సిద్ధారెడ్డి, హరినాథ్ రెడ్డి సహకారంతో, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ ఆడిటర్ కంటి రామ్మోహన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్ వెస్ట్ వారోత్సవాల్లో నూతనంగా ప్రారంభించి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయని అన్నారు. ఈ కార్యక్రమంలో ,సనత్ కుమార్ రెడ్డి ,ధనుంజయ రెడ్డి ,బలరాం రెడ్డి ,డాక్టర్ రాజా ,చంద్రహాస్ పాల్గొన్నారు.

తిరుపతిలో యమహా బ్లూ స్క్వేర్ ఔట్‌లెట్ ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఇండియా యమహా మోటర్ (ఐవైఎం) ప్రైవేట్ లిమిటెడ్ నూతన బ్లూ స్క్వేర్ ఔట్‌లెట్‌ను తిరుపతిలో శుక్రవారం ప్రారంభిం చింది. ఆర్కె ఎంటర్‌ప్రైజెస్' బ్యానర్‌పై తిరుపతి రేణిగుంట రోడ్డులో జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ యమహా బ్లూ స్క్వేర్ షోరూమ్‌లు అత్యంత వ్యక్తిగ తీకరించిన విధానం ద్వారా సమగ్రమైన సేల్స్, సర్వీస్, సపోర్ట్‌లో కస్టమర్‌లకు అత్యుత్తమ అనుభవాన్ని అందించడానికి రూపొ ందిం చారన్నారు. ఈ ప్రీమియం అవుట్‌లెట్‌లలోని ప్రతి విభాగం అంతర్జాతీయ మోటార్‌స్పోర్ట్స్‌లో లోతుగా పాతుకుపోయిన గ్లోబల్ బ్రాండ్‌తో అనుబంధం కలిగి ఉన్నందుకు గర్వించదగ్గ భావాన్ని విని యోగదారులకు కలిగించడానికి ఆలోచనాత్మకంగా రూపొందించ బడ ింది. ఈ సిద్ధాంతానికి అనుగుణంగా మార్గనిర్దేశం చేయబడిన, యమ హా బ్రాండ్ గర్వించదగిన రేసింగ్ వారసత్వాన్ని సూచించే "బ్లూ" యమహా ద్విచక్ర వాహనాలలోని ఉల్లాసకరమైన, స్పోర్టీ, స్టైలిష్ శ్రేణితో కనెక్ట్ అవ్వడానికి క్యూరేటెడ్ ప్లాట్‌ఫారమ్‌కు ప్రతీకగా "స్క్వేర్" కలయిక ద్వారా కస్టమర్‌లతో తక్షణ సంబంధాన్ని ఏర్పరుచుకుందని తెలిపారు. దీన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కంకర తోలారు.. రోడ్డు మరమ్మతు పూర్తి చేయరా?

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండల పరిధిలోని ఆనం బట్టు రోడ్డు, తొర్రూరు, గోపాలకృష్ణాపురం వెళ్లే దారి ఆర్అండ్‌బిరోడ్ కొండల్ చెరువు వద్ద గుంతల రోడ్డు మరమ్మతులకు కాంట్రాక్టరు 20 రోజుల క్రితం కంకర తోలాడు. దాన్ని పట్టించుకోకుండా వదిలేశారు. స్కూల్ పిల్లలు, కుటుంబ సభ్యులు స్కూటర్లలో రాత్రిపూట వెళ్లే సమయంలో తెలియకుండా పడి లేచి ప్రమాదాలకు గురై వెళుతున్నారు. సంబంధిత అధికారులు రోడ్డు మరమ్మతులపై శ్రద్ధ చూపా లని కోరుతున్నారు. తక్షణం కంకర మట్టి పోసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.